క్లుప్తంగా

బాధ్యతలు స్వీకరించిన సీఐ


కె.వినోద్

ఖమ్మంక్రైం: ఖమ్మం విజిలెన్స్ అండ్ ఏపీటీఎస్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్‌గా కె. వినోద్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. నిర్మల్ జిల్లా ముథోల్ సీఐగా పనిచేసి ఖమ్మం విజిలెన్స్-ఏపీటీఎస్ పోలీస్‌స్టేషన్‌కు డిప్యూటేషన్‌పై వచ్చారు. ఆయన పరిధిలో ఖమ్మం, కొత్తగూడెం జిల్లాలు ఉన్నాయి.

కుటుంబానికి యువకుడి అప్పగింత


రంజిత్‌కుమార్‌ను కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న ఎస్సై భాస్కరరావు, శ్రీనివాసరావు

ఖమ్మంఅర్బన్: ఇంటి వద్ద నుంచి వెళ్లిపోయిన యువకుడు అన్నం ఫౌండేషన్, రైల్వే ఎస్సై భాస్కర్‌రావు చొరవతో కుటుంబం చెంతకు చేరాడు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం సహస్ర జిల్లా భగవాన్పూర్‌కు చెందిన రంజిత్ కుమార్ గత నెల 9న ఇంటి నుంచి బయటకువచ్చి 20న ఖమ్మం రైల్వేస్టేషన్‌లో తిరగసాగాడు. గమనించిన ఖమ్మం రైల్వే ఎస్సై పారుపల్లి భాస్కరరావు అతడిని చేరదీసి అన్నం ఫౌండేషన్‌కి సమాచారం ఇచ్చారు. స్పందించిన అన్నం శ్రీనివాసరావు యువకుడిని చేరదీసి వైద్యం చేయించగా తన వివరాలు తెలిపాడు. ఈ మేరకు కుటుంబ సభ్యులు ఖమ్మం చేరుకొని పూర్తి వైద్యం చేసిన తర్వాత మంగళవారం రైల్వే ఎస్సై భాస్కరరావు సమక్షంలో అన్నం ఫౌండేషన్ కుటుంబ సభ్యులకు అప్పగించింది.

అనాథ శవానికి అంత్యక్రియలు

ఖమ్మం వైద్యవిభాగం: అన్నం ఫౌండేషన్ ఆధ్వర్యంలో అనాథశవానికి మంగళవారం నగరంలోని బల్లేపల్లి వైకుంఠధామంలో అంత్యక్రియలు నిర్వహించారు. నగరంలోని 1 టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ముస్తఫానగర్‌లో యువకుడు మృతి చెందగా మృతదేహాన్ని మార్చురీకి తరలించి భద్రపరిచారు. ఈ మేరకు యువకుడికి ఎవరూ లేకపోవడంతో పోలీసులు ఫౌండేషన్‌కు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు పోలీసులు, వైద్యశాల సిబ్బంది సమక్షంలో అంత్యక్రియలు నిర్వహించారు. ఫౌండేషన్ చైర్మన్ అన్నం శ్రీనివాసరావుతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

ఒకే దఫా.. రెండు ఉద్యోగాలు


ఆంజనేయులు

కూసుమంచి: మండలంలోని నర్సింహులగూడెం గ్రామానికి చెందిన పెరుమాళ్లపల్లి ఆంజనేయులు గురుకుల ఫలితాల్లో ప్రతిభ చాటి రెండు ఉద్యోగాలు సాధించాడు. గురుకుల టీచర్, లెక్చరర్ పోస్టులను సాధించాడు. ఈ మేరకు పలువురు ఆయన్ను అభినందించారు.

నివాళి

కామేపల్లి: మండలంలోని టేకులతండా గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉద్యోగి లకావత్ రాధాకృష్ణమూర్తి (42) అనారోగ్యంతో మృతి చెందగా మంగళవారం కాంగ్రెస్ నాయకులు ఆయన మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ మండలాధ్యక్షుడు గింజల నరసింహారెడ్డి, ఉపాధ్యక్షుడు రెడబోతు గోపీరెడ్డి, ఎంపీటీసీ నల్లమోతు లక్ష్మయ్య, జగన్నాథరెడ్డి, రాంబాబు, శంకర్ ఉన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	ఊరుపేరు భైరవకోన
వినోద	ఆపరేషన్ వాలెంటైన్
సాయిరాం	డ్యూన్
ఆదిత్య	కిక్
శ్రీనివాస	చారి 111
సుందర్	హను-మాన్

- ఖమ్మంగాంధీచౌక్

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	20	బచ్చలికూర	3
వంకాయ	46		20
బెండకాయ	46	పాలకూర	3
పచ్చిమిర్చి	40		20
కాకర	50	చుక్కకూర	3
బీర	46		20
దొండ	30	తోటకూర	2
పొట్లకాయ	46		10
నాటు చిక్కుడు	110	గోంగూర	2
గోరుచిక్కుడు	46		10
క్యాబేజీ	24	మెంతికూర	3
క్యాలీఫ్లవర్	30		20
ఆలుగడ్డ	24	కొత్తిమీర	1
చామగడ్డ	60		30
క్యారెట్	36	పుదీన	1
క్యాప్సికం	64		20

-ఖమ్మం వ్యవసాయం

కిష్కింధకాండ..



భయపెడుతున్న వానరాలు

- ముస్తఫానగర్ యూపీహెచ్‌సీ ప్రాంతంలో బెడద
- దాడులు చేస్తున్నాయంటూ స్థానికుల ఆవేదన


యూహెచ్‌సీలో ఆవరణలోని మొక్కలను నాశనం చేసిన కోతులు(ఇన్‌సెట్) యూపీహెచ్‌సీ వద్ద కోతులు

ఖమ్మంమయూరిసెంటర్: వానరాల ఆగడాలకు అంతులేకుండాపోతోంది. వీటి తీరుతో స్థానికులు భయభ్రాంతులకు గురవుతున్నారు. బయటకు వెళ్లాలంటేనే భీతిల్లుతున్నారు. వచ్చి పోయే వారిపై దాడులు చేయడం, చెట్లు, మొక్కలను పెకిలించివేయడం చేస్తూ బీభత్సం సృష్టిస్తున్నాయి. నగరంలోని ముస్తఫానగర్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ పరిసర ప్రాంతాల్లో కోతులు వేదుల సంఖ్యలో సంచరిస్తున్నాయి. పగలు, రాత్రి తేడా లేకుండా ఇళ్ల మధ్యలోనే తిరుగుతుండటంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు.

వామ్మో.. పీహెచ్‌సీకి రావాలా..

కోతులు ముస్తఫానగర్ అర్బన్ పీహెచ్‌సీని ఆవాసంగా మార్చుకున్నాయి. ప్రతిరోజు సాయంత్రం ఆ ప్రాంతానికి చేరుకుని అక్కడే సంచరిస్తూ స్థానికులను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. ఉదయం పూట పీహెచ్‌సీతోపాటు ఇళ్లల్లోకి చేరి బీభత్సం సృష్టిస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పీహెచ్‌సీలోని మొక్కలను మొత్తం నాశనం చేశాయి. ఇక పీహెచ్‌సీకి ఎవరైనా వైద్య పరీక్షల కోసం వస్తే వారి వెంట పడటంతోపాటు కరచినంత పనిచేస్తున్నాయి. కొన్ని సందర్భాల్లో రోగులు ఆసుపత్రిలో నుంచి బయటకు, బయట నుంచి లోపలికి వెళ్లకుండా అడ్డుకుంటున్నాయి. ఉదయం షుగర్ పరీక్షలు చేయించుకునేందుకు వచ్చిన వారిని ఇబ్బంది పెడుతున్నాయి. పరీక్ష అనంతరం తినేందుకు అల్పాహారం తెచ్చుకుంటే వాటిని చేతిలో నుంచి లాక్కుంటున్నాయని స్థానికులు వాపోతున్నారు.

ఇళ్ల మధ్యలోనే..

ఇక కోతులు ఇళ్ల మధ్యలోనే ఉంటూ స్థానికులకు కంటి మీద కునుకులేకుండా చేస్తున్నాయి. ఇళ్లల్లో పెంచుకుంటున్న మొక్కలను నాశనం చేయడంతోపాటు ఇంటి బయట ఉన్న సామాన్లను చిన్నాభిన్నం చేస్తున్నాయి. డస్ట్‌బిన్‌లు ఉంటే వాటిని కింద పడేస్తున్నాయి. ఇంటిపై ఉన్న డీటీహెచ్ డిష్‌లను కదపడంతోపాటు వాటి తీగలను తెంపేస్తున్నాయి. పీహెచ్‌సీ పక్కనే ఉన్న పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు,తల్లిదండ్రుల వెంట పడి భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. కొన్ని సందర్భాల్లో కోతులు వెంట పడుతుండగా కింద పడిన సంఘటనలున్నాయని స్థానికులు చెబుతున్నారు. నెలన్నరగా కోతుల బెడద విపరీతంగా ఉందని, మున్సిపల్ అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

పలువురు గాయపడ్డారు...



నెలరోజులకు పైగా ఈ ప్రాంతంలో కోతుల సంఖ్య భారీగా పెరిగింది. ఉదయం, సాయంత్రం తేడా లేకుండా ఇళ్ల మధ్యే తిరుగుతుండటంతో బయటకు రాలేకపోతున్నాం. కోతులు వెంట పడుతుండటంతో పలువురు కింద పడి గాయపడ్డారు. కోతులను బయటకు తరలించాలి.

- ఎం.వాసుదేవరెడ్డి, స్థానికుడు

ఆస్పత్రికి రావాలంటేనే భయం



కోతుల బెడదతో ఆసుపత్రికి రావాలంటే భయమేస్తోంది. ఆసుపత్రి ఆవరణలోనే కోతులు సంచరిస్తుండటంతో లోపలికి వెళ్లడం వీలు కావడం లేదు. ఆవరణలోని మొక్కలన్నింటినీ నాశనం చేశాయి. ఇష్టం వచ్చినట్లు తిరుగుతూ ఆసుపత్రికి వచ్చే వారిని భయపెడుతున్నాయి.

- తన్నీరు పద్మ, ఆయా, పీహెచ్‌సీ

వెంట పడుతున్నాయి..



ప్రతీరోజు పిల్లలను స్కూల్‌కు తీసుకెళ్లి, తీసుకొచ్చే సమయంలో కోతులు వెంటపడుతున్నాయి. కోతులు లేని సమయాన స్కూల్‌కు వెళ్లాల్సిన పరస్థితి ఉంది. ఎక్కడెక్కడ కోతులు లేవా అని చూస్తూ జాగ్రత్తగా వెళ్లాల్సి వస్తోంది. స్థానికులంతా కోతులతో ఇబ్బంది పడుతున్నారు.

- ఎస్‌కే.సుజావుద్దీన్, స్థానికుడు

లైన్‌మెన్ల సేవలు మరువలేనివి


లైన్‌మెన్లను సన్మానిస్తున్న విద్యుత్ అధికారులు

కామేపల్లి: విద్యుత్ వినియోగదారులకు నిరంతరం సేవలు అందిస్తున్న లైన్‌మెన్ల సేవలు మరువలేనివని విద్యుత్ శాఖ ఏడీ ఆనంద్‌కుమార్, ఏఈ శ్రీనివాసులు అన్నారు. జాతీయ లైన్‌మెన్ దినోత్సవంలో భాగంగా కొత్తలింగాల విద్యుత్ శాఖ కార్యాలయంలో మంగళవారం జేఎల్‌ఎం, ఏఎల్‌ఎం, ఎల్ఎంలను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉద్యోగ బాధ్యతల్లో భాగంగా నిరంతరం సేవలు అందించడం, విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడం గొప్ప విషయమన్నారు. కరుణాకర్, శంకర్, శ్రీను, సురేష్, కుమార్, రమేష్, అనంతబాబు, నాగేశ్వరరావు, రాంచందర్, భద్రు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


మాట్లాడుతున్న శేషగిరిరావు

కూసుమంచి: విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిస్కమ్ ప్రాంతీయ కార్యదర్శి టి. శేషగిరిరావు కోరారు. మంగళవారం పాలేరులో 1104 యూనియన్ ఖమ్మం రూరల్ డివిజన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యుత్ సంస్థల్లోని ఖాళీలను భర్తీ చేయాలని, ఆన్‌మ్యాన్ కార్మికులను ఆర్టిజన్‌లుగా గుర్తించాలని, డిపార్టుమెంట్ నందు కారుణ్య నియామకాలు చేపట్టాలని కోరారు. డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు ఎంవీ.రమణారెడ్డి, కార్యనిర్వాహక అధ్యక్షుడు జీఎల్‌ఎస్ రావు, రాష్ట్ర నాయకులు వెంకటేశ్వర్లు, సురేష్, జాకీర్, సీతారాం, నరేష్, సురేష్, నాగేశ్వరరావు, రాందాసు తదితరులు పాల్గొన్నారు.

జీరో బిల్లు అందజేత


జీరో బిల్లు అందజేస్తున్న సైదులు

ఖమ్మంఅర్బన్: గృహజ్యోతి పథకంలో భాగంగా నగరంలోని 8వ డివిజన్ వైఎస్సార్‌నగర్‌లో జీరో బిల్లును కార్పొరేటర్ లకావత్ సైదులు నాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ నిరుపేదల సంక్షేమం కోసం పనిచేస్తుందని, ఆరు గ్యారంటీ పథకాలు నిరుపేదలకు చాలా ఉపయోగ పడతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీ రమేష్, ఏఈ అశోక్, నాగేశ్వరావు, అబ్రహం, వంశీ, మీటర్ రిడర్లు తదితరులు పాల్గొన్నారు.

స్టాఫ్‌నర్సు పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మం వైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలోని ఏఆర్‌టీ సెంటర్‌లో కాంట్రాక్ట్ ప్రాతిపదికన పనిచేయటానికి ఒక స్టాఫ్‌నర్సు పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ ఎల్.కిరణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. జీఎన్‌ఎం, బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసి ఐదేళ్ల అనుభవం కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హత కలిగిన వారు ఈ నెల 15 లోపు దరఖాస్తులను పెద్దాస్పత్రిలోని కార్యాలయంలో అందజేయాలని ఆయన కోరారు.

వినతి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఖమ్మంవన్‌టౌన్: అంగన్‌వాడీలకు వేసవికాలంలో ఒంటిపూట బడులను పెట్టాలని కోరుతూ మంగళవారం బీఆర్‌టీయూ యూనియన్ నాయకులు ఐసీడీఎస్ పీడీ రాంగోపాల్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందించారు. మే నెల మాసమంతా హెల్పర్లకు, టీచర్లు సెలవులు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాటూరు లక్ష్మీనారాయణ, పారిజాతం, సుశీల, లక్ష్మీ, పద్మ, రెహానా, అలివేలు పాల్గొన్నారు.

కోర్సులపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న ఇగ్నో డీడీ రమేష్

ఖమ్మం సహకారనగర్: నగరంలోని సోషల్ వెల్ఫేర్ మహిళా డిగ్రీ కళాశాల, ఫార్మసీ కళాశాలలను ఇగ్నో రీజినల్ సెంటర్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ రమేష్ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఇగ్నో అందజేస్తున్న సర్టిఫికెట్స్, డిప్లొమా, పీజీ డిప్లొమా, డిగ్రీ, పీజీ కోర్సులపై అవగాహన కల్పించారు. అత్యధిక నైపుణ్యాలను సాధించి మారుతున్న ఉపాధి రంగంలో అవకాశాలను అందిపుచ్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాలల ప్రిన్సిపాళ్లు ఝాన్సీరాణి, వెంకటేశ్వరరావు, రాజీవ్‌కుమార్, కవిత మెమోరియల్ డిగ్రీ కళాశాల, ఇగ్నో స్టడీ సెంటర్ కో ఆర్డినేటర్ రమణారావు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక


పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి తుమ్మల

ఖమ్మంవన్‌టౌన్: నగరంలోని 44వ డివిజన్ అధ్యక్షుడు గుడిపూడి జగదీష్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమక్షంలో పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. బీఆర్‌ఎస్ పార్టీలో నుండి వచ్చిన వారి సమస్యలను మంత్రి అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా 12వ డివిజన్ పరిధిలో నివసిస్తున్న రిటైర్డ్ అడిషనల్ ఎస్పీ అశోక్‌కుమార్ తండ్రి ఇటీవల మరణించగా మంత్రి తుమ్మల వారి కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లో ప్రతిభ


విద్యార్థినులతో యాజమాన్యం

ఖమ్మంరూరల్: మండలంలోని పెదతండాలోని ప్రియదర్శిని ఇంజనీరింగ్ మహిళా కళాశాలలో మంగళవారం నిర్వహించిన క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లో కళాశాలకు చెందిన విద్యార్థినుల ఉత్తమ ప్రతిభ కనబర్చారు. హైదరాబాద్‌కు చెందిన ఎడ్జిటా కంపెనీ వారు బిజినెస్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ పోస్టులకు మొత్తం 17మంది విద్యార్థినులను ఎంపిక చేసినట్లు ప్రిన్సిపాల్ జి. గోపాల్ తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల కళాశాల చైర్మన్ కె. నవీన్ విద్యార్థినులను అభినందించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ అట్లూరి వెంకటరమణ, అధ్యాపకులు, వివిధ విభాగాల అధిపతులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా వైద్యాధికారికి సన్మానం


సుబ్బారావును సన్మానిస్తున్న రవికుమార్

ఖమ్మం మామిళ్లగూడెం: జిల్లా వైద్యాధికారిగా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ వరికూటి సుబ్బారావును బీఆర్ అంబేడ్కర్ ప్రజా సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు లింగాల రవికుమార్ మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా సుబ్బారావును సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

సందేశాత్మక చిత్రాలు తీయాలి


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న మంత్రి పొంగులేటి

నేలకొండపల్లి: శ్రీలక్ష్మి సమ్మక్క క్రియేషన్స్ వారి ఆధ్వర్యంలో నిర్మించనున్న గోల్డ్ నెంబర్-1 సినిమాకు సంబంధించిన పోస్టర్లను మండలకేంద్రంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సినిమాలో స్థానిక కళాకారులు ఉండటం చాలా సంతోషంగా ఉందని సినిమా డైరెక్టర్, నిర్మాత బోడపాటి కృష్ణను ప్రత్యేకంగా అభినందించారు. ప్రజలకు మంచి సందేశం అందించే చిత్రాలను తీయాలి. ఈ కార్యక్రమంలో కళాకారులు చిలకబత్తిని వీరబాబు, వడ్డె జగన్, మేకల వెంకటేశ్వర్లు, నాయకులు నెల్లూరి భద్రయ్య, బచ్చలకూరి నాగరాజు, నరేష్ పాల్గొన్నారు.

పరామర్శ..

ఖమ్మంవన్‌టౌన్: ప్రమాదంలో గాయపడి రాపర్తినగర్ తన నివాసంలో ఉన్న కాంగ్రెస్ నాయకుడు శెట్టి రంగారావును మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పరామర్శించారు. మంత్రి వెంట మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, మువ్వా విజయబాబు, రాయల నాగేశ్వరరావు, బేబి స్వర్ణకుమారి, బొర్రా రాజశేఖర్, సీపీఐ నాయకుడు సింగు నర్సింగరావు, పోటు కళావతి, ఎర్రా శ్రీకాంత్, వై విక్రమ్, నర్రా రమేష్, నల్లమల వేణు, ఉపేందర్‌రెడ్డి, బోడ వీరన్న, కొప్పుల చంద్రశేఖర్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి లేకుండా చర్యలు


మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీనివాస్ నాయక్

కూసుమంచి: వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ బాణోత్ శ్రీనివాస్ నాయక్ కోరారు. మంగళవారం నిర్వహించిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ... భూగర్భజలాలు అడుగంటంతో పాటు పాలేరు రిజర్వాయర్‌లో తగినంత నీరు లేకపోవటంతో ప్రత్యమ్నాయ ఏర్పాట్లు చేపట్టాలన్నారు. గ్రామాల్లో ఇప్పటికే బోరు,బావులు ఎండిపోవటంతో నీటివనరులను గుర్తించి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. పాలేరుకు సాగర్‌నీరు విడుదల చేసి తాగునీటికి ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. తహసీల్దార్ సురేష్ మాట్లాడుతూ... భూ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించేందుకు తగు చర్యలు తీసుకుంటున్నందున సమస్యలు ఉన్నవారు తహసీల్దారు కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎక్సైజ్ అధికారుల తీరును సభలో పలువురు ప్రశ్నించారు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీ కంచర్ల పద్మ, ఎంపీడీఓ వేణుగోపాల్‌రెడ్డితో పాటు పలువురు ఎంపీటీసీ సభ్యులు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

రక్తదానంతో చిన్నారులను ఆదుకోండి


మందులు పంపిణీ చేస్తున్న ఏసీపీలు

ఖమ్మంవైద్యవిభాగం: అత్యవసర చికిత్సలకు, ప్రమాదాల సమయంలోనే రక్తం దొరకడం చాలా కష్టంగా ఉంటుందని, అలాంటిది తలసేమియా చిన్నారులకు ప్రతీ 15-20 రోజులకు ఒకసారి రక్తం సేకరించి ఎక్కించడం సాధారణ విషయం కాదని ఏఆర్ ఏసీపీలు ఏ.నర్సయ్య, సుశీల్ సింగ్ అన్నారు. మంగళవారం నగరంలోని సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో సంస్థ కార్యాలయం వద్ద తలసేమియా చిన్నారులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... సంస్థ ఆధ్వర్యంలో వందల మంది చిన్నారులకు రక్తం సేకరించి అందించడం గొప్ప విషయమన్నారు. వేసవి కాలంలో దాతలు ముందుకొస్తేనే చిన్నారుల జీవిత కాలం పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ చావా నారాయణరావు, వైద్యులు డి.నారాయణమూర్తి, సునీత, సంస్థ ఉపాధ్యక్షురాలు పి.పావని, పి.ఉదయ్‌భాస్కర్, పి.రవిచందర్, అనిత తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి


చప్టా వద్ద నీటిని పరిశీలిస్తున్న నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం నగర పాలక సంస్థ పరిధిలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, వేసవి కాలం ప్రారంభం కావడంతో ఈ సమస్య తీవ్రతరం అయ్యే ప్రమాదం ఉందని వెంటనే దీనిని పరిష్కరించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మహ్మద్ సలాం అధికారులను కోరారు. మంగళవారం సీపీఐ నాయకులు మున్నేరు చప్టా వాటర్ ఫిల్టర్ బెడ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మున్నేరులో నీరు లేని కారణంగా పంపు హౌస్‌లోకి నీరు అందడం లేదని, పాలేరు నుండి నీటిని తరలించి నీటి సమస్యను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నూనె శశిధర్, సాంబశివరెడ్డి, జ్వాల నర్సింహారావు, రహ్మాన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఖమ్మంవ్యవసాయం: నగరంలోని 33/11 కేవీ రామాలయం సబ్ స్టేషన్ పరిధిలో ఉన్న 11 కేవీ చర్చి కాంపౌండ్ ఫీడర్‌కు విద్యుత్ సరఫరా(డీటీఆర్) పనుల కారణంగా బుధవారం మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని టౌన్-2 ఏడీఈ వై.రమేష్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో ముత్యాలమ్మ గుడి సెంటర్, ఎస్పీ ఆఫీస్ రోడ్, చర్చి కాంపౌండ్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

బోరు ప్రారంభం

కూసుమంచి: మండలంలోని నాయకన్‌గూడెం బీసీ కాలనీలో మంగళవారం బోరును ప్రారంభించారు. కాలనీలో తాగునీటి సమస్యను మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా సమస్యను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. మంత్రి ఆదేశాలతో అధికారులు రెండు బోర్లకు మోటార్లు, పైప్‌లైన్ వేయించారు. దీంతో కాలనీ వాసులకు తాగునీటి కష్టాలు తీరటంతో మంత్రికి కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రారంభ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కంచర్ల పద్మా, మాజీ ఎంపీటీసీ సభ్యులు కొమిరెల్లి అలింగ గోవిందరెడ్డి, సింగం దామోదర్, నాయకులు మారోజు భీష్మాచారి, ఉపేందర్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో బీజేపీని ఓడించాలి


మాట్లాడుతున్న తిరుమలరావు

ఖమ్మం మామిళ్లగూడెం: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని ఓడించాలని ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ కోర్‌కమిటీ సభ్యులు నల్లమోతు తిరుమలరావు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు స్వర్ణ సుబ్బారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... మరోసారి మోదీ ప్రధాన మంత్రి అయితే గుడులు, జైళ్లు తప్ప మరే అభివృద్ధి ఉండదని, ప్రజల జీవనప్రమాణాలు క్షీణిస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. రైతుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు పి. శ్రీనివాస్, ఆర్గనైజింగ్ కార్యదర్శి రాంబాబు, కోశాధికారి చల్లా కల్పన తదితరులు పాల్గొన్నారు.

డ్రైయినేజీ తిప్పలకు పరిష్కారం


శుభ్రం చేస్తున్న ప్రొక్లయినర్

ఖమ్మంఅర్బన్: నగరంలోని ఒకటో డివిజన్ కైకొండాయిగూడెంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చొరవతో డ్రైయినేజీ సమస్య పరిష్కారమైంది. అక్కడి మురుగు సమస్యను స్థానికులు ఆయన దృష్టికి తీసుకెళ్లగా దీంతో స్పందించిన మంత్రి సమస్యను పరిష్కరించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. దీనిపై సత్వర చర్యలు చేపట్టారు. ప్రొక్లయినర్‌తో కొత్తగా డ్రైయినేజీ తవ్వించారు. పూడుకుపోయిన పాత డ్రైయినేజీలో మురుగు తొలగించే పనులు పూర్తి చేయించారు. దీంతో చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ సమస్యకు పరిష్కారం లభించిందని ఆ ప్రాంతవాసులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు గణేష్ టౌన్‌షిప్ అధ్యక్షులు రాజేంద్రప్రసాద్, విహార అపార్ట్‌మెంట్ కార్యదర్శి గంగాధర్, స్థానికులు మంత్రి పొంగులేటికి కృతజ్ఞతలు తెలిపారు.